

వర్షంలోనే రాజ్‌భవన్ మార్గంలో పనులను సమీక్షిస్తున్న జీహెచ్ఎంసీ ఉపకమిషనర్లు రజనీకాంత్‌రెడ్డి, సమ్మయ్య

భారీ వర్షం

● రోడ్లపై ఉధృతంగా వరద ప్రవాహం ● ఇళ్లలోకి చేరిన నీరు ● అనేక ప్రాంతాల్లో నేలకూలిన చెట్లు ● ఎక్కడికక్కడ ట్రాఫిక్‌జాం..● ప్రజలు, వాహనదారులు తిప్పలు



ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయంలోకి భారీగా చేరుకున్న నీరు

అప్పటిదాకా 37 డిగ్రీల ఎండ...అంతలోనే భారీ వర్షం పడటంతో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. ఈదురుగాలులతో కూడిన వాన కురవడంతో చాలా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై, కాలనీలు, వీధుల్లో ఉన్న చెట్లు నేలకొరిగాయి. బాల్కాపూర్ నాలాలో ఎక్స్‌కవేటర్ మునిగిపోయింది. మధ్యాహ్నం నుంచి నిమిషాల పాటు తెరపినిస్తూ సాయత్రం వరకు మళ్లీమళ్లీ వర్షం పడడంతో బయటకు, బయట నుంచి ఇళ్లకు వెళ్లలేక ప్రజలు, వాహనదారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు రోడ్లపై నీరు భారీగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించింది. పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు. వరద నీరు ఆగకుండా చర్యలు తీసుకున్నారు.



సోమాజిగూడ బస్తీలో ఉధృతంగా వరదనీటి ప్రవాహం

ఖైరతాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లో పాఠ్యపుస్తక ముద్రణాలయం, రైల్వేగేటు అవతల ఉన్న ఖైరతాబాద్ ప్రధాన రహదారిలోని రాజీవ్‌కూడలి, మింట్ కాంపౌండ్, ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్, ఇందిరానగర్ కాలనీ, బీజేఆర్ నగర్‌లో షరా మామూలుగానే వర్షపు నీరు నిండిపోయింది. ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లోని జైన్ మందిర్ పక్క వీధిలో నీరు భారీగా నిలిచిపోయింది. ప్రధాన రహదారు లైన లక్కీ హోటల్ చౌరస్తా, హోమ్ సైన్స్ కళాశాల ఎదురుగా, సచివాలయం ఎదురుగా ఎప్పటిమాదిరి గానే నీరు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఇక ఖైరతాబాద్ ఇందిరానగర్‌కాలనీ గుండా బీజేఆర్ నగర్‌కు వెళ్లే రోడ్డు చెరువును తలపించింది.

ట్రాఫిక్ జాంలో వాహనదారులు

ప్రధాన రహదారులపై వర్షపునీరు నిలిచిపోవడంతో ఖైరతాబాద్, లక్డీకాపూల్, మాసాబ్‌ట్యాంక్, సైఫాబాద్, కంట్రోల్‌రూం, నాంపల్లి, సోమాజిగూడ, పంజాగుట్ట తదితర మార్గాల్లో తీవ్ర ట్రాఫిక్‌జాం నెలకొంది. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకొని వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్ పోలీసులు తీవ్ర శ్రమకోడ్చి రాత్రి వరకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు తీసుకున్నారు.

పోలీసుల శ్రమదానం..

వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో ఎన్టీఆర్ మార్గం, నెక్లెస్‌రోడ్ రోటరీ చౌరస్తా, పీవీ మార్గాలతో పాటు పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. రోడ్లపై చెట్లు విరిగిపడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ఖైరతాబాద్ పోలీసులు శ్రమకోడ్చి విరిగిన చెట్లను పక్కకు జరిపి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌తో పాటు ఎస్సైలు, సిబ్బంది విరిగిన చెట్లను తొలగించేందుకు కష్టపడ్డారు.

● **పంజాగుట్ట :** ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి పంజాగుట్ట పరిధిలోని రహదారులు చెరువులను తలపించాయి. బంజారాహిల్స్ వైపు నుంచి వస్తున్న బాల్కాపూర్ నాలా పూర్తిగా నిండిపోయింది. ఇప్పటికే అక్కడ నాలా సిల్ట్ వర్క్ జరుగుతుండగా, వ్యర్థాలను తొలగిస్తున్న జేసీబీ వరదనీటిలో మునిగిపోయింది. సోమాజిగూడ సూర్యకు టీర్ అపార్ట్‌మెంట్ వద్ద చెట్టుకొమ్మ విరిగింది.

● **యూసుఫ్‌గూడ:** గురువారం సాయత్రం కురిసిన అకాల వర్షానికి నిమ్స్ ఆస్పత్రి ప్రధాన గేట్ ముందు చెట్ల చెమ్మలు ఇరగడంతో కొద్ది సేపు వాహనాలు నిలచిపోయాయి. సిబ్బంది ఇరిగిన చెట్ల కొమ్మలను తొలగించారు. మిలీనియం బ్లాక్ ముందు వర్షపు నీరు భారీగా నిలిచింది. యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ బీ, సీ బ్లాక్‌లల్లో వర్షపు నీరు నిలవడంతో రోడ్లపైట్రాఫిక్‌జామ్ అయింది. ఉరుములు, మెరుపులు, ఈదుర గాలితో వర్షం రావడంతో పలు బస్తీల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేశారు.



ఖైరతాబాద్ ప్రధాన రహదారి రాజీవ్ కూడలి వద్ద నిలిచిపోయిన వర్షపునీరు



నెక్లెస్‌రోడ్ రోటరీ చౌరస్తాలో రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న ఖైరతాబాద్ పోలీసు అధికారులు, సిబ్బంది



ఇందిరానగర్‌కాలనీ నుంచి బీజేఆర్ నగర్ వరకు రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీరు

రోడ్లపై నిలిచిన వరద నీరు..

బంజారాహిల్స్: హఠాత్తుగా కురిసిన వర్షానికి అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లోని లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. ఎల్లారెడ్డిగూడ కృష్ణా అపార్ట్‌మెంట్, నాగార్జున నగర్‌కాలనీలో భారీగా వరదనీరు నిలవటంతో రాకపోకలు నిలిచాయి. బంజారాహిల్స్, షౌకత్‌నగర్, యూసుఫ్‌గూడ కృష్ణానగర్ అన్ని బ్లాక్‌ల్లో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన భారీగా వరదలో వాహనాలు కొట్టుకుపోయాయి.



తుమ్మలబస్తీ వద్ద బాల్కాపూర్ నాలాలో మునిగిన ఎక్స్‌కవేటర్



కృష్ణానగర్‌లోని పూర్ణ టిఫిన్ సెంటర్ వద్ద నిలిచిన వరద నీరు



నిమ్స్ ఆస్పత్రి మిలీనియం బ్లాక్ ముందు నిలచిన వర్షపు నీరు



నిమ్స్ ఆస్పత్రిలో ఇరిగిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది



వర్షంలో గొడుగులు పట్టుకుని వెళుతున్న యువతులు



పిడమర్తి రవికి స్వీట్ తినిపిస్తున్న నాయకులు

రేపటి నుంచి ఎస్సీ వర్గీకరణ విజయోత్సవాలు

పంజాగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కన్నా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బెటర్ అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. రాష్ట్రంలో మాదిగలు 9 శాతం రిజర్వేషన్ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ సనత్‌నగర్, నాంపల్లి, మలక్‌పేట నియోజకవర్గాల్లో, కవాడిగుడలో మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సంబరాలు నిర్వహించామని పిడమర్తి రవి తెలిపారు. ఏపీలో వర్గీకరణ బిల్లు ఆమోదించకుండా ఆర్డినెన్స్ తేవడం వల్ల మాదిగలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈనెల 5 నుంచి వంద నియోజకవర్గాల్లో పర్యటించి ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తామని అన్నారు. వచ్చే వారంలో సికింద్రాబాద్,సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో మాదిగల అలయ్-బలాయ్ నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సంబురాలలో జేఏసీ నాయకులు సత్యనారాయణ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షులు శేఖర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, మాదిగ యూత్ చేసి రాష్ట్ర అధ్యక్షులు నక్క మహేష్, మాదిగ జేఏసీ నాయకులు జోగు గణేష్ , యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బోర్‌ను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

అమీర్‌పేట, ఎప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్ రవీంద్రనగర్‌లో అనుమతి లేకుండా వేసిన బోరును అమీర్‌పేట రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. నీలం రమేష్ అనే వ్యక్తి అనుమతులు తీసుకోకుండా సెలవు రోజైన గత ఆదివారం బోరు వేశారు. విషయం తెలుసుకున్న అమీర్‌పేట తహసీల్దార్ పద్మ సుందరి సిబ్బందితో విచారణ జరిపించారు. బోరుకు ఎలాంటి అనుమతులూ లేవని నిర్ధారించి బోర్‌ను సీజ్ చేశామని తెలిపారు.

గ్రూపు-4లో ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

మూడు లక్షలు వసూల్ చేసిన హోంగార్డుపై కేసు

పంజాగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) గ్రూపు-4లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఒకరి నుంచి మూడు లక్షల రూపాయలు వసూలు చేశాడో హోంగార్డు. ఉద్యోగం ఇప్పించక పోగా డబ్బులు ఇచ్చిన వారినే బెదిరిస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ప్రతాప్‌సింగారంకు చెందిన జి.సునీల్‌గౌడ్ భార్య ధారావత్ భార్గవి గ్రూపు-4 పరీక్ష రాసింది. 2012లో సునీల్‌గౌడ్‌కు వేరే స్నేహితుడి ద్వారా హోంగార్డ్ డి.చంద్రప్రకాష్ (8284)తో పరిచయం ఏర్పడింది. గత సంవత్సరం సునీల్ భార్య ఏమి చేస్తోంది అని అడిగాడు. గ్రూపు-4 పరీక్ష రాసింది అని చెప్పాడు. 1:4 నిష్పత్తిలో ఎస్టీ కోటా కింద గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని హోంగార్డ్ డి.చంద్రప్రకాష్ వారికి చెప్పాడు. ఉద్యోగం గురించి పైఅధికారులతో మాట్లాడతానని నమ్మబలికాడు. ఆమె విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలను గత సంవత్సరం ఏప్రిల్ 7న తీసుకున్నాడు.మొత్తం రూ.6 లక్షలు అవుతుందని హోంగార్డ్ డి.చంద్రప్రకాష్ వారితో అన్నాడు. దీనికి వారు సరేనని చెప్పి తమ బ్యాంక్ ఖాతా నుంచి అతని బ్యాంక్ ఖాతాకు రూ.3 లక్షలను ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. మిగిలా డబ్బుల కోసం భార్గవి నుంచి ఖాళీ చెక్కును తీసుకున్నాడు. డబ్బులు తీసుకున్న తరువాత చంద్రప్రకాష్ స్పందించడం లేదు. ఉద్యోగం కూడా ఇప్పించలేదు. పలుమార్లు తిరిగినా, ఫోన్లు చేసినా స్పందించక పోవడంతో మోసపోయామని గ్రహించి, గతనెల 29న సునీల్ గౌడ్ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కొమరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ సీఎన్.రెడ్డి

దొడ్డి కొమరయ్యకు నివాళి

బోరబండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోరాటంలో అసువులు బాసిన తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య జయంతిని రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో గురువారం నిర్వహించారు. దొడ్డి కొమరయ్య చిత్రపటానికి కార్పొరేటర్ సీఎన్.రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కొమరయ్య పోరాట పటిమను, త్యాగనిరతిని ఆయన కొనియాడారు.



ఎంఎస్ మక్తాలో నిర్వహించిన ఈద్ మిలాప్‌లో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి, తదితరులు

ఎంఎస్ మక్తాలో ఈద్ మిలాప్

ఖైరతాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రంజాన్ అనంతరం జరుపుకునే ఈద్ మిలాప్ ఎంఎస్ మక్తాలో గురువారం జరిగింది. కార్పొరేటర్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి విజయారెడ్డి పలువురు ముస్లింపెద్దల ఇళ్లకు వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం పెద్దలు విజయారెడ్డిని సత్కరించి ఆశీర్వదించారు.

12న వీర హనుమాన్ విజయ యాత్ర

గౌలిగూడ హనుమాన్ మందిర్ నుంచి తాడ్‌బండ్ వరకు

పంజాగుట్ట/హైదరాబాద్‌సిటీ, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): కులాలకు, ప్రాంతాలకు అతీతంగా హిందువులందరూ సంఘటితం కావాలని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ నాయకులు డాక్టర్ రావినూతల శశిధర్, వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామితో కలిసి హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 12న నిర్వహించనున్న వీర హనుమాన్ విజయ యాత్ర పోస్టరును ఆవిష్కరించారు. గత సంవత్సరం కన్నా ఎక్కువగా ఈ సారి గౌలిగూడ హనుమాన్ మందిర్ నుంచి తాడ్‌బండ్ హనుమాన్ మందిర్ వరకు వీరహనుమాన్ విజయయాత్రను వైభవంగా నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



వీర హనుమాన్ విజయయాత్ర పోస్టరును ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, శశిధర్, శివరాములు, బాలస్వామి, తదితరులు

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయి.. లేదంటే దిగిపో

● రాజ్యాంగ సవరణ, 9వ షెడ్యూల్ పేరుతో కొత్త రాగం ఎందుకు? ● మే 23న బీసీల ధర్మయుద్ధ బేరీ

పంజాగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి బీసీల పట్ల ఏమాత్రం గౌరవం, బాధ్యత, నిజాయితీ ఉన్నా వెంటనే 42 శాతానికి పెంచిన బీసీ రిజర్వేషన్లను రాష్ట్రంలో అమలు చేయాలని బీసీ జన సభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ విజిఆర్ నారగోని, బీసీ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు పాలూరి రామకృష్ణయ్య, బీసీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేష్ గౌడ్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో ఆమోదించిన బీసీ బిల్లులను వెంటనే గవర్నర్ ఆమోదంతో అమలు చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కులగణన బీసీల సమస్యలన్నింటికీ పరిష్కారమని చెప్పింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. రాజ్యాంగ సవరణ, 9వ షెడ్యూల్ పేరుతో ఢిల్లీలో మోదీపై ధర్మ యుద్ధం ధర్నా చేయడం కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌రెడ్డి ద్వంద వైఖరికి నిదర్శనం అని అన్నారు. 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్రంలో అమలు చేయకుండా అటకెక్కించేందుకే సీఎం ఈ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. మొదట రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు చేసుకుని కేంద్రంపై కొట్లాడుదామని సూచించారు. మే 23న బీసీల ధర్మ యుద్ధ బేరి సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు మేకల కృష్ణ, జవహర్ నగర్ కార్పొరేటర్ మేకల లలిత యాదవ్, వాసు కె.యాదవ్, జల్ల నరేందర్ నేత,కొంపెల్లి రాజు, బి.రామచంద్ర యాదవ్, సాయన్న ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

'ఎడ్యుగేట్ లయన్' అవార్డులకు నామినేషన్ల ఆహ్వానం

ఖైరతాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఎడ్యుకేషన్ రీసెర్చ్, సేవా సంస్థ ఎడ్యుగేట్ ఫౌండేషన్ తమ వార్షిక లయన్ నేషనల్ అవార్డుల కోసం నామినేషన్లను ఆహ్వానిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను పారిశ్రామిక, ఆరోగ్య, విద్యా రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపించిన భారతీయ సంస్థలు, వ్యక్తులు అవార్డుల కోసం నామినేషన్లను పంపించవచ్చునని తెలిపారు. గురువారం ఖైరతాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎడ్యుగేట్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ మాన్విత అవార్డుల వివరాలను తెలియజేశారు. విద్యారంగం, ఆరోగ్య పరిరక్షణ, ఆటోమొబైల్, ఐటీ, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, కన్‌స్ట్రక్షన్ అండ్ రియల్ ఎస్టేట్, టూరిజం, ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ ,ఎనర్జీ, మొబైల్స్ అండ్ టెలికాం, వ్యవసాయ రంగాల్లో ఉత్తమ సేవలు, ప్రతిభ చూపిన వారు అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. నామినేషన్లను మే 15వ తేదీవరకు పంపాలని, అవార్డులను మే 31వ తేదీన హైదరాబాద్‌లో జరిగే జాతీయ పారిశ్రామిక సదస్సులో అందజేస్తామని ఆమె తెలిపారు. నామినేషన్లను వెంకట్ ఎట్ దరేట్ ఎడ్యుగేట్‌ఫౌండేషన్‌డాట్ కామ్ మెయిల్‌కు పంపాలని, వివరాలకు హెచ్‌టీటీపీ:ఎడ్యుగేట్ ఫౌండేషన్ డాట్ కామ్ వెబ్‌సైట్‌లో గానీ, ఫోన్ నెంబరు 8712217555లో గాని సంప్రదించాలని ఆమె కోరారు.

శ్రీరామ నవమి వేడుకలకు హాజరు కండి

బేగంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని కుమ్మర బస్తీలో గల హనుమాన్ దేవాలయంలో ఈనెల 6వ తేదీన నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి కోట నీలిమను ఆలయ అధికారులు ఆహ్వానించారు. గురువారం అమీర్‌పేటలోని ఆమె కార్యాలయంలో ఆలయ ఈవో జయంతి కాంగ్రెస్‌పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమను కలిసి ఆహ్వానించారు.



శ్రీరామ నవమి వేడుకలకు కోట నీలిమను ఆహ్వానిస్తున్న అమీర్‌పేట హనుమాన్ ఆలయ ఈవో జయంతి



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364

ప్రభుత్వ భూములను కాపాడండి

● తహసీల్దార్‌కు కార్పొరేటర్ వినతి



ముషీరాబాద్ తహసీల్దార్‌తో సమావేశమైన కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్,ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్ మండి డివిజన్‌లోని ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడాలని కార్పొరేటర్ సామల హేమ ముషీరాబాద్ మండల తహసీల్దార్ రానా ప్రతాప్ సింగ్‌ను కోరారు. గురువారం మండల కార్యాలయంలో తహసీల్దార్‌తో కార్పొరేటర్ సమావేశమయ్యారు. డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ప్రయత్నం చేస్తున్నారని, ప్రభుత్వ భూములను గుర్తించి సర్వే చేసి వాటి చుట్టూ కంచె వేయాలని విజ్ఞప్తి చేశారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఆలస్యం కాకుండా చూడాలని కోరారు. సుభాష్‌చంద్రబోస్ నగర్ డబుల్ బెడ్‌రూమ్‌లు అందని లబ్ధిదారులకు తర్వగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 21న సీతాఫల్‌మండిలో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్‌ను గురువారం తార్నాకలోని తన కార్యాలయంలో ఆవిష్కరిస్తున్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి. – (తార్నాక,ఆంధ్రజ్యోతి)



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్యామ్‌కుమార్

రేపు ఉచిత వైద్య శిబిరం

తిరుమలగిరి ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం 7వ వార్డు పరిధిలోని జీవిత బీమా కార్యాలయం సమీపంలోని జేఎస్‌ఎస్‌యూఆర్‌ఎం కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ తెలిపారు. గురువారం ఉచిత వైద్య శిబిరం పోస్టర్‌ను లాల్‌బజార్ లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో రిలీజ్ చేశారు. డయాబెటీస్, రక్తపోటు, థైరాయిడ్, దీర్ఘకాళిక జ్వరం, మోకాళ్ల నొప్పులు, ఆస్తమా రోగులకు సీనియర్ వైద్యులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వార్డు-7 బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల రుక్మయ్య, ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ రాజా రెడ్డి, పాండు, లావణ్య, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న నర్సింహన్

ఎమ్మెల్యే కు ఆహ్వానం

తిరుమలగిరి ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన హనుమాన్ ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా ఈ నెల 6న నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను ఆయన నివాసంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నర్సింహన్ కన్నన్ కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవి బాలరాజు, రాజు, కన్నన్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం



లీల

బౌద్ధనగర్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. న్యూమెట్టుగూడకు చెందిన రాముల లీల(61) వరంగల్‌లో ఉండే తన అక్క ఇంటికి వెళ్తున్నానని మార్చి 31వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లింది. కాగా లీల తన అక్క ఇంటికి చేరుకోలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో లీల కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో భర్త రాముల చీరాలు తన భార్య కనిపించటంలేదని బుధవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆఫీసుకు వెళ్తున్నానని చెప్పి..



రాధిక

ఇంటి నుంచి ఆఫీస్‌కు వెళ్తున్నాని చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. ఎస్‌ఐ సబితా తెలిపిన వివరాల ప్రకారం. సీతాఫల్‌మండి మేడిబావికి చెందిన నర్రా రాధిక(26) ఈనెల 2వ తేదీ ఉదయం 9.30నిమిషాలకు ముషీరాబాద్‌లో ఆఫీస్‌కు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి వెళ్లింది. ఉదయం పదకొండు గంటలకు తమ్ముడు గణేశ్ అక్క రాధికకు ఫోన్ చేయటంతో స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆఫీస్‌కు వెళ్లగా అక్కడి రాలేదని సిబ్బంది తెలిపారు. ఆమె కోసం పలుచోట్ల గాలించిన వెతికిన ఫలితం లేదు. దీంతో తన అక్క రాధిక కనిపించటం లేదని తమ్ముడు గణేశ్ బుధవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో వ్యక్తి..

ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓవ్యక్తి అదృశ్యమయ్యాడు. ఏఎస్‌ఐ దివాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం సీతాఫల్‌మండికి చెందిన ముందాడ పంకజ్‌కుమార్(43) మార్చి 31వ తేదీ సాయంత్రం ఆరున్నర గంటలకు ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావటంతో అతని కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. దీంతో భార్య చంచల్ తన భర్త కనిపించటం లేదని బుధవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భారీ వర్షం.. లష్కర్ జలమయం

● ఉప్పొంగిన ఓపెన్ నాలాలు
● కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో మోకాలి లోతు వరద
● ఇళ్లలోకి చేరిన వర్షం నీరు
● కొట్టుకుపోయిన వంట సామగ్రి
● రోడ్లపై నిలిచిన నీరు.. రాకపోకలకు జనం అవస్థలు



వారాసిగూడ మహ్మద్‌గూడ ప్రధాన రహదారిపై భారీగా నిలిచిన వరద నీరు



న్యూఅశోక్‌నగర్‌లో పారుతున్న వర్షపునీరు

సికింద్రాబాద్/బౌద్ధనగర్/అడ్డగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి లష్కర్‌లోని పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లపై గంటల తరబడి వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇళ్లు, కార్యాలయాలకే పరిమితమయ్యారు. వరద నీరు తగ్గిన తర్వాతే బయటకు వచ్చారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని పలు కాలనీలు, బస్తీల్లో మోకాలి లోతు వరకు వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎల్.నారాయణనగర్, పుల్లయ్యబావి, న్యూఅశోక్‌నగర్, మహ్మద్‌గూడ, బ్రాహ్మణబస్తీలు జల మయమయ్యాయి.

కంటోన్మెంట్‌లోని రామన్నకుంట చెరువు చుట్టుపక్కల ఉన్న సాయిబాబా కాలనీ, సీతారాంపూర్, సౌజన్య కాలనీ, ధనలక్ష్మి కాలనీ, పవన్‌విహార్ కాలనీ, రసూల్‌పురా, అన్నానగర్, అర్జున్‌నగర్, ఇందిరమ్మనగర్, శ్రీలంకబస్తీ, చంద్రబాబునాయుడు నగర్, తిరుమలగిరి, సెంట్రల్‌బ్యాటరీ, చిన్నకమేళా, పెద్ద కమేళా ప్రాంతాల్లో వర్షం నీటి వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ఇళ్లలోకి చేరిన వర్షం నీరు..

బౌద్ధనగర్ డివిజన్‌లోని ఎల్.నారాయణనగర్, న్యూఅశోక్‌నగర్, పుల్లయ్యబావి, సీతాఫల్‌మండి డివిజన్‌లోని మహ్మద్‌గూడ, షాబాద్‌గూడ, బ్రాహ్మణబస్తీ, శ్రీనివాసనగర్ నాలా పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ఇళ్లలోకి భారీగా వర్షం నీరు చేరింది. వంట సామగ్రితో పాటు పలు వస్తువులు వర్షం నీటిలో కొట్టుకుపోయాయి. ఎల్.నారాయణనగర్‌లో వరద నీటిలో కొట్టుకుపోతున్న వాహనాలను తాడుల సహాయంతో స్థానికులు ఆపారు. గత 25 ఏళ్లుగా వర్షం పడినప్పుడల్లా నాలాలు పొంగి చాలా ఇబ్బందులు పడుతున్నామని, వాన పడిదంటే చాలు భయ భ్రాంతులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. నాలా పరివాహక ప్రాంతాలు ముంపునకు గురవుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవటం లేదని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడ్డగుట్ట డివిజన్‌లో...

అడ్డగుట్టలోని హేరంబ గణపతి ఆలయం వెనుక వైపు ఉన్న ఓపెన్ డ్రైనేజీలోకి వర్షం నీరు చేరి పొంగిపొర్లడంతో కాలనీలోని ఇళ్లలోకి నీరు వచ్చి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కబ్జాకు గురైన నాలాలోకి వర్షం నీరు చేరడంతో పరిస్థితి దారుణంగా మారిందని, ఇక్కడి పరిస్థితిపై స్థానిక కార్పొరేటర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే స్పందిం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. లోహియనగర్, మరాఠాబస్తీ, అడ్డగుట్ట మసీద్ (తుకారాంగేట్ పోలీస్ స్టేషన్)కు వెళ్లే దారిలో వర్షం నీరు రోడ్లపై చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చింతబావిలో...

చిలకలగూడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ చింతబావిలో ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత, అసిస్టెంట్ ఇంజనీర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయితో కలిసి పరిస్థితి సమీక్షించారు. ఇళ్లలోని వర్షం నీరు బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. శ్రీదేవి థియేటర్ వద్ద నాలాలోని చెత్త తొలగింపజేసి నీరు సాఫీగా వెళ్లేలా చేశారు.



బోయిన్‌పల్లిలో జలమయమైన రోడ్డు

బోయిన్‌పల్లిలో ..

బోయిన్‌పల్లి: వర్షానికి రహదారులన్నీ జలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు, పాఠశాలల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సీతారాంపురం, భవానినగర్, గణేష్ నగర్ కాలనీ, మర్రి రాంరెడ్డి కాలనీ, నెల్లూరి పోచమ్మ ఆలయం కాలనీ, హర్షవర్ధన్ కాలనీల రోడ్లు జలమయం అయ్యాయి.



శ్రీదేవి థియేటర్ వద్ద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ సునీత



వరదలో వాహనదారుడి అవస్థలు



అడ్డగుట్టలోని ఓ ఇంటి ఆవరణలోకి చేరిన మురుగు



పుల్లయ్యబావి ప్రాంతంలో..



న్యూఅశోక్‌నగర్‌లో ఇంటిలోకి చేరిన నీరు





వర్షంలో ఆనందంగా..

కూలిన కమ్యూనిటీ హాల్ ప్రహరీ



వర్షానికి కూలిన ప్రహరీ

పద్మారావునగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్ వెంకటాపురం కాలనీలోని తుంగభద్ర మహిళా మండలి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కొన్ని నెలల క్రితం తవ్వి వదిలేశారు. పనులు సైతం మొదలు కాలేదు. గురువారం కురిసిన వర్షానికి కాలనీలో పారిన వాన నీరు మొత్తం కమ్యూనిటీ హాల్ స్థలంలోకి చేరి ప్రహరీ కూలిపోయింది. దాంతో వరద పక్కనే ఉన్న ఇళ్లలోకి వెళ్లడంతో ఇంట్లోని వస్తువులన్నీ తడిసిపోయాయి. గదుల్లో నిండిన నీటిని బకెట్లతో బయటకు తోడి పోశారు. .మున్సిపల్ అధికారులు సకాలంలో కమ్యూనిటీ హాల్ నిర్మణం చేపట్టి ఉంటే ఇలాంటి పరిస్థతి వచ్చేది కాదని స్థానికులు పలువురు వాపోయారు.



సికింద్రాబాద్‌లో ట్రాఫిక్ జామ్..

మార్కెట్ ధర కంటే ఎక్కువ పరిహారం

● 'ఎలివేటెడ్ కారిడార్' నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి ఎమ్మెల్యే శ్రీగణేశ్ హామీ

తిరుమలగిరి ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి పై ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్‌ఆర్ వరకూ నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ వల్ల ఆస్తులు కోల్పోతున్న వారితో తిరుమలగిరి టీచర్స్ కాలనీ కమ్యూనిటీ సెంటర్‌లో అధికారులు గురువారం గ్రామ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం నానాటి విస్తరిస్తోందని, ఈ క్రమం లో పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్ల విస్తరణ అని వార్యమని ఎమ్మెల్యే అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల వల్ల సామా న్య లు నష్టపోకుండా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్వార్థపూరితంగా కొంతమంది ప్రజల్లో అనుమానాలను రేకెత్తిస్తున్నారని, వారి మాటలు నమ్మి ఆందోళనలో పడొద్దని ఎమ్మెల్యే అన్నారు. ఈ కారిడార్‌లో భూములు కోల్పోతున్న వారికి మార్కెట్ రేటు కంటే అధికం గా సంతృప్తికరమైన పరిహారం ఇప్పించే బాధ్యత తనదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కొంత మంది కోర్టుకు వెళ్లడం వల్ల మిగతా వారందరికీ నష్టం జరుగుతుందన్నారు. తిరుమలగిరి ఎమ్మార్వో కార్యాలయంలో ఒక కౌంటర్ ఏర్పాటు చేసి పరిహారం విషయంలో ప్రజలకు ఎలాంటి సందే హాలు ఉన్నా నివృత్తి చేయాలని ఎమ్మెల్యే సలహా ఇచ్చారు. గ్రామ సభలో పాల్గొన్న వారు అడిగిన పలు సందేహాలకు అధికారులు సమా ధానాలు ఇచ్చారు. డీఆర్‌ఓ వెంకటచారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ ఆండ్ అక్విజేషన్) అపర్ణ, ఓఎస్డీ మనోహర్, తహసీల్దార్ అశోక్, హెచ్‌ఎండీఏ డీఈఈ సత్యప్రసాద్, ఏసీపీ రమేష్, కంటోన్మెంట్ అధికారులు కాలనీ ప్రతినిధులు ఎలివెటెడ్ కారిడార్ భూనిర్వాసితులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడుమురళీ ముదిరాజ్ ఆధ్వర్యంలో తిరుమలగిరి లాల్‌బజార్‌లోని మహంకాళి బస్‌స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రారంభించారు. మానవసేవే మాధవ సేవ అని, ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా శ్రీగణేశ్ అన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నరసింహ యాదవ్

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి

మారేడుపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కురుమ జాతిలో తొలి అమరుడు, తెలంగణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని రాష్ట్ర కురుమ సంఘం వైస్ ప్రెసిడెంట్ పెద్దాల నరసింహ యాదవ్ అన్నారు. గురువారం కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డు పరిధిలోని మహాత్మా గాంధీ నగర్‌లో దొడ్డి కొమరయ్య కురుమ 98వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు సాయిలు, మాధవ్, అశోక్, కొమురయ్య. రాజ్, లింగమయ్య, రాజు, ఎల్లేష్, సాయిలు, చందు, తాయప్ప, రమేష్, కిష్టప్ప, బసవప్ప, అమ్రేష్, కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. సంజీవయ్య పార్కు సమీపంలో ఈ ఘటన జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ జనరల్ బజార్‌కు చెందిన పురుషోత్తం (49) వ్యాపారి. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన పురుషోత్తం గురువారం జెమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ సమీపంలోని సంజీవయ్య పార్కు వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | జి.అంజయ్య: 9985921364